క్లుప్తంగా

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



కనకయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండలంలో ఆదివారం పర్యటించారు. పెద్ద మాసాన్‌పల్లి, తుక్కాపూర్ గ్రామాలలో బీఆర్ఎస్ నాయకుల ఇళ్లలో నిర్వహించిన శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కోల కనకయ్య తండ్రి సిద్దాగౌడ్ ఇటీవల మరణించగా వారిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు సుజాత, రాంరెడ్డి, అరుణ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, స్వామి, రమేశ్, కనకయ్య, అనిత, కొమురయ్య, రాజిరెడ్డి, కనకయ్య, నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్సులు నడపాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నెంటూరు గ్రామస్తులు

వర్గల్(గజ్వేల్): తమ గ్రామానికి బస్సులు నడపాలని కోరుతూ డిపో మేనేజర్‌కు మండలంలోని నెంటూరు గ్రామస్తులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రామానికి బస్సులు నడిపేవారని, నాలుగు సంవత్సరాల నుంచి నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు నడిపితే అన్ని వర్గాల ప్రజలకు రవాణాసౌకర్యం మెరుగుపరచినట్లవుతుందని కోరారు. గతంలో మాదిరిగా నెంటూరుకు బస్సు నడపాలని గ్రామస్తులు ప్రదీప్‌గౌడ్, మధుగౌడ్, కిచ్చుగారి పాండు, ఎర్రవల్లి భాను, ఎలగందుల నవీన్, బన్నీ, కృష్ణ కోరారు.

ఘనంగా విక్టరీ డే



చిన్నారులకు సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్‌లో స్వేరో ఆధ్వర్యంలో ఆదివారం విక్టరీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేశ్ కుమార్ మాట్లాడుతూ అణచివేతకు గురైన సమాజం నుంచి వచ్చిన ఇద్దరు పిల్లలు ప్రపంచానికి గొప్ప సందేశాన్ని అందించారన్నారు. స్వేరో విద్యార్థులు పూర్ణ, ఆనంద్ కుమార్ ఎవరెస్టును అధిరోహించి చరిత్ర సృష్టించారని చెప్పారు. గ్రామాల్లో పిల్లలకు ప్రేరణ దినంగా మే 25ను మార్చాలని సూచించారు.అనంతరం పలువురు చిన్నారులకు సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ నాయకులు శంకర్, నర్సింహులు, బాబు, మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలను సరఫరా చేయాలి



లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ

మిరుదొడ్డి(దుబ్బాక): రైతుల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జీలుగ విత్తనాలను వెంటనే సరఫరా చేయాలని మాజీ జెడ్పీటీసీ సూకూరి లక్ష్మి డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో ఆదివారం ఆమె మాట్లాడుతూ వానాకాలం సమీపిస్తున్న తరుణంలో వేసవి దుక్కులు దున్నుకున్న రైతులు జీలుగ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అన్ని గ్రామాల్లో జీలుగ విత్తనాలను పంపిణీ చేయాలని కోరారు. లేదంటే రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆమె వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగం, బాబు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకుడు

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందుల బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు ఉప్పరి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం మండల కేంద్రంలో ఆయనకు పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోఅభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు చేరుతున్నాయన్నాని, యవత పార్టీని బలోపేతంచేసేందకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు నరేందర్‌రెడ్డి, నిరంజన్, మహిపాల్‌రెడ్డి, స్వామి, కరుణాకర్ పాల్గొన్నారు.

అలిరాజ్‌పేట నుంచి నిర్మల్‌నగర్‌కు వెళ్లే మట్టి రోడ్డు



పనులు నిలిచిన చిన్నక్రిష్టాపూర్- పీటీ వెంకటాపూర్ రోడ్డు



మట్టి రోడ్లకు మోక్షమెప్పుడో?

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● అర్ధంతరంగా నిలిచిన మూడు గ్రామాల రోడ్లు ● రైతులు విన్నవించినా కానరాని ఫలితం

పల్లె ప్రాంతాల రవాణా సౌకర్యం మెరుగుపడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా గత ప్రభుత్వం మట్టి రోడ్లను బీటీ రోడ్లు నిర్మించింది. అయితే కొన్ని చోట్ల ఆ పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని బండ్ల బాటలను బీటీ రోడ్లుగా మార్చాలని ఎన్నోయేళ్ల నుంచి వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మారిస్తే గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది.

మట్టి రోడ్లు ఇవే...

మండలంలోని అంతాయిగూడ నుంచి జంగంరెడ్డిపల్లి వరకు; అలిరాజ్‌పేట నుంచి నిర్మల్‌నగర్ వరకు; అలాగే తిగుల్ నుంచి అక్కారం వరకు, తిగుల్ నుంచి దాతర్‌పల్లి వరకు; లింగారెడ్డిపల్లి నుంచి జగదేవ్‌పూర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల భువనగిరి ప్రధానరోడ్డు వరకు, చిన్నకిష్టాపూర్ నుంచి రామునిబండ ఆలయం వరకు, ఎల్లాయిగూడలో విజయ్ మెమోరియల్ పాఠశాల నుంచి జంగంరెడ్డిపల్లి వరకు, కొత్తపేట నుంచి వర్ధరాజ్‌పూర్ శివారు వరకు మట్టి రోడ్డు సౌకర్యం ఉంది. గతంలో మట్టి రోడ్ల మరమ్మతుకు కంకర కూడా వేశారు. కానీ ప్రస్తుతం మట్టి రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. ఇక వర్షాకాలంలో ఐతే అటువైపు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల నిర్మాణం కోసం ఇటీవల తిగుల్ రైతులు ఎంపీ రఘునందన్‌రావుకు వినతి పత్రం అందించారు.

మధ్యలోనే నిలిచిపోయిన పనులు

మండలానికి మూడు చోట్ల పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి కొన్నేళ్ల క్రితం నిధులు మంజూరు చేశారు. గొల్లపల్లి నుంచి పలుగుగడ్డ వరకు ఎస్‌జీఎఫ్ కింద రూ.1.50 కోట్లు మంజూరు కాగా మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. పలుగుగడ్డ సమీపంలో కిలో మీటరన్నర్ వరకు భూములు పోతున్నాయని రైతులు నిరాకరించడంతో నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అలాగే అనంతసాగర్ నుంచి చిన్నకిష్టాపూర్ వరకు ఆరేళ్ల క్రితం బీటీ రోడ్డు వేశారు. చిన్నకిష్టాపూర్ సమీపంలో రైతులు అడ్డుకొని కోర్టులో కేసు వేయడంతో అక్కడ కూడా పనులు ఆగిపోయాయి. అలిరాజ్‌పేట బీజీవెంకటాపూర్ మధ్యలో చెక్‌డ్యామ్ బ్రిడ్జి నిర్మాణం మూలంగా పనులు నిలిచిపోయాయి.

పనులు పూర్తయ్యేలా చూస్తాం

మండలంలోని వివిధ గ్రామాల్లో మట్టి రోడ్ల పరిస్థితి గురించి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. మూడు చోట్ల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని కూడా ఉన్నతాధికారులకు వివరిస్తాం. అధికారుల ఆదేశాల మేరకు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– రాకేశ్, పీఆర్, ఏఈ, జగదేవ్‌పూర్

అందరి సహకారంతో డ్రగ్స్‌ను అరికడదాం

నియోజకవర్గ జేఏసీ కో–ఆర్డినేటర్ వీరన్న



కుందనవానిపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వీరన్న

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్‌ను అందరూ కలిసి తరిమికొట్టాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కో–ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ అన్నారు. మండలంలో రెండో రోజు గౌరవెల్లి, కుందనవానిపల్లి, రామవరం, గండిపల్లి గ్రామాల్లో ఆదివారం డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా మన బిడ్డలు, మన ఊరు, మన ఇంటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, మండల ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, పోరుయాత్ర కో–ఆర్డినేటర్ వేముల జగదీశ్, నాయకులు కుమారస్వామి, పద్మ, జగన్, రాజు, ఎల్లయ్య, ప్రభాకర్‌గౌడ్, సాయిన్న, దినేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



అశోక్ గౌడ్

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అన్నెబోయిన అశోక్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు అందేవిధంగా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ రుణాలు, గృహలక్ష్మి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ, సన్న ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్, ఇందిరమ్మ ఇండ్లు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేస్తూనే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

ప్రశాంతంగా పద్మశాలి సమాజం ఎన్నికలు



ఓటు వేసిన పద్మశాలి సమాజం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పద్మశాలి సమాజం ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. మార్కండేయ ఆలయంలో ఎన్నికల అధికారి మామిడాల గౌరి మోహన్, సహాయకుడు చిప్ప ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. మొత్తం 3,650 ఓట్లు ఉండగా 2,221 ఓట్లు పోల్ అయ్యాయి. 60.84 శాతం పద్మశాలీలు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షులుగా కాముని రాజేశం, చేర్యాల మల్లికార్జున్, లగిశెట్టి నరసింహులు పోటీలో పాల్గొన్నారు. ఎన్నికలను జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు కస్తూరి సతీశ్, ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పాఠశాలల అభివృద్ధికి నిధులు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.30.80 లక్షలు మంజూరు కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని పోతారం (ఎస్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయింది. మంత్రి పొన్నం పాఠశాల సందర్శనకు వచ్చినప్పుడు నిధులు ఇవ్వాలని కోరడంతో ఆయన కలెక్టర్‌కు ప్రతిపాదించారు. దీంతో ప్రహరీ, మూత్రశాలల నిర్మాణానికి రూ.16.80లక్షలు, అలాగే తోటపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి రూ.14లక్షలు మంజూరు చేయించారు. దీంతో గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ



క్రీడాభారతి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఆపరేషన్ సిందూర్ విజయానికి శ్రమించిన భారత సైనికులకు మద్దతుగా ఆదివారం క్రీడాభారతి తెలంగాణ అధ్యక్షుడు సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీహెచ్‌ఈల్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన ర్యాలీలో 250 మంది క్రీడాభారతి సభ్యులు పాల్గొని జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎయిర్ ఫోర్స్ అధికారులు శ్రీనివాస రఘునందన్, శ్రీనివాస్, క్రీడాభారతి సభ్యులు పాల్గొన్నారు.

బొల్లారంలో..

జిన్నారం (పటాన్‌చెరు): పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన భారత త్రివిధ దళాలకు బొల్లారంలో జేజేలు పలికారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో సైనికులకు మద్దతుగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, సీఐ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ వాసులు త్రివర్ణ పతాకాలతో భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. పాకిస్తాన్ దుశ్చర్యలకు భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టిందని పేర్కొన్నారు. అఖిలపక్ష నాయకులు ఆనంద్‌కృష్ణారెడ్డి, గుడ్ల మహేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, స్థానికులు పాల్గొన్నారు.

'నీటి పన్ను పెంచితే కార్యాలయాన్ని ముట్టడిస్తాం'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మున్సిపల్ పాలకవర్గం నీటిపన్ను పెంపు ఆలోచనను ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ఇబ్బంది పడుతున్న పేద ప్రజలపై సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం అధిక పన్నులు మోపడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో ఇప్పటి వరకు నెలకు రూ.150 ఉన్న నల్లా బిల్లును పెంచి ఆలోచనలో మున్సిపల్ పాలకవర్గం ఉందని, పేద ప్రజలపై భారం మోపే విధంగా పన్నులు పెంచడం సరి కాదన్నారు. ఈ నిర్ణయాన్ని మున్సిపల్ పాలకవర్గం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామి పురుషుల పొదుపు సంఘం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొనగం రమేశ్, ఉపాధ్యక్షుడిగా బుర్ర కిషన్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, వివిధ సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు రాజయ్య, స్వామి, వెంకట్‌రెడ్డి, రమేశ్, వెంకటేశ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఎల్లమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పునర్నిర్మించిన ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. 28 నుంచి 30వ తేదీ వరకు ఎల్లమ తల్లి ఉత్సవాలు జరగనున్నాయి. అందులో భాగంగా వేద పండితులు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం బీఎంఎస్‌కే సాధ్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కార్మికుల సంక్షేమం, అభివృద్ధి బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్)తోనే సాధ్యమని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. ఆదివారం మండలంలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్ సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్మికులకు చట్టబద్ధమైన ఉద్యోగ భద్రత, స్వేచ్ఛ కల్పిస్తానని పేర్కొన్నారు. ఈ నెల 28న జరిగే యూనియన్ ఎన్నికల్లో కాగడా గుర్తుకు ఓటేసి బీఎంఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి

సంగారెడ్డి టౌన్: నిజమైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూమ్‌లు ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. ఆదివారం సంగారెడ్డి మండలంలోని దాసుగడ్డ గ్రామపంచాయతీలోని డబుల్ బెడ్రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలన్నారు.

సాగునీటి వృథాను పట్టించుకోరా?



వృథాగా పోతున్న నీటిని చూపుతున్న రైతులు

హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువు తూము నుంచి నీరు వృథాగా పోతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ వాపోయారు. ఆదివారం ఆయన రైతులతో కలిసి తూమును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటకాలం పూర్తయిన తర్వాత కూడా తూము నుంచి నీటిని వదులుతున్నారన్నారు. తూము నుంచి వచ్చే నీరువల్ల గడ్డి మురిగి పోతుందని, పశుగ్రాసం కోసం రైతులకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే తూము ద్వారా వచ్చే నీటిని నిలిపివేయాలని చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, తిరుపతి, రవి, రాములు, మణిదీప్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములు పరిరక్షిస్తా

కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: మండలంలోని చౌదర్‌పల్లిలో నకిలీ పత్రాలతో ఆక్రమణలకు గురైన పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన భూములను సంరక్షించి, వారి హక్కులను కాపాడడానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి చెప్పారు. పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం బాధిత రైతులు ఆయనను కలిసి తమ భూములను తిరిగి ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌదర్‌పల్లిలో 294 సర్వే నంబర్లో 45 ఎకరాల 17 గుంటల భూములు, ఎనగుర్తి శివారులో 145, 146 సర్వే నంబర్లో మరి కొన్ని ఎకరాలు ఎస్సీ, ఎస్టీల భూములున్నాయన్నారు. 1986లో అప్పటి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ కింద భూములను పంపిణీ చేసిందని, ఆ భూములు నేడు ఆక్రమణకు గురైతే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం దొరకదు కాని నకిలీ పత్రాలతో బడా బాబుల చేతుల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుల్లో సంపాదించిన అవినీతి సొమ్మును ఎన్నికల సమయంలో పంచి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని ఆరోపించారు. సమావేశంలో ఆయా మండలాల అధ్యక్షులు రవి, వెంకటస్వామి, నాయకులు శ్రీనివాస్, ఏసురెడ్డి, చంద్రం తదితరులున్నారు.

నాలుగు నెలలు గడుస్తున్నా వేతనాల్లేవు



శ్రీనివాస్

మిరుదొడ్డి(దుబ్బాక): ఒప్పంద ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని అక్బర్‌పేట–భూంపల్లి టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 2008 డీఎస్సీ రాసిన అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా 1,382 మంది నాలుగు నెలల క్రితం ఒప్పంద ఉపాధ్యాయులుగా నియామకమయ్యారన్నారు. వృత్తిని చేపట్టేందుకు 17 యేళ్ల నుంచి నిరీక్షించాల్సి వచ్చిందని, ఉపాధ్యాయులుగా నియామకమై నాలుగు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడం సరి కాదన్నారు. నియామకాలు, వేతనాల చెల్లింపులు కూడా ఆలస్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించడంతో పాటు, ఒప్పంద విధానాన్ని ఎత్తివేసి రెగ్యులర్ పే స్కేల్‌ను అనుమతించాలని డిమాండ్ చేశారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



పనులు ప్రారంభిస్తున్న అయిలయ్య

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రతి గిరిజనతండాకు బీటీ రోడ్డు సదుపాయం కల్పించాలన్నదే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య అన్నారు. మండలంలోని శ్రీరామ్‌తండా పరిధిలోని బాబురావుతండా, చైన్యతండా, మంజ్యానాయక్ తండాలలో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తండాలలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. గిరిజనశాఖ ఆధ్వర్యంలో మంజూరైన బీటీ రోడ్ల పనులు సైతం త్వరలో పూర్తికానున్నాయని చెప్పారు. తండాతండాలకు బీటీరోడ్ల సదుపాయం కల్పించడంపై తండావాసులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్ నాయక్, భూక్య రాజునాయక్, శ్రీనివాస్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు



ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి నరేశ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో విత్తనాలు వేసే ముందు జీలుగ, జనుము విత్తనాలు నాటుకుంటే సహజ వంతమైన ఎరువుగా ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సహజ ఎరువులను వాడాలని సూచించారు. దాని వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నారని, జనుము 40 కిలోలకు రూ.2,510; జీలుగ 30 కిలోలకు రూ.2,137 చెల్లించాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిన్నకోడూరు(సిద్దిపేట): పదేళ్ల పాటు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలిసి సందడి చేశారు. చిన్నకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా చిన్ననాటి మిత్రులతో సరదాగా గడిపారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.

గుండారంలో..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఆనాటి విషయాలను గుర్తుచేసుకున్నారు. వారికి విద్య బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు.



గుండారం ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థులు